
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
బుధవారం 17 జూలై 2024

రేషన్ కార్డు లేకున్నా రూ.2 లక్షల రుణమాఫీ 7

డెంగ్యూపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి 8

బదిలీల బెంగ



- ఉద్యోగుల్లో ట్రాన్స్‌ఫర్ టైం ఫీవర్
- ఎక్కడికి బదిలీ అవుతుందోనని గుబులు
- ఇప్పటికే ముగిసిన అప్షన్ల ప్రక్రియ

జగిత్యాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ బెంగ పట్టుకుంది. జిల్లాలో ఉద్యోగులెవరిని కదిలించినా...ఇదే ముచ్చట వినిపిస్తోంది. ఎవరెవరు సీనియర్లు, ఎక్కడికి బదిలీ అయ్యే అవకాశం ఉంది... ఇతరత్రా విషయాలపై జోరుగా చర్చించుకుంటున్నారు. ఎక్కడికి బదిలీ అవుతుందోనని పలువురు ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసింది. శాఖల వారీగా బదిలీల కోసం ప్రత్యేక కమిటీలు పనిచేస్తు న్నాయి. సీనియారిటీ జాబితాలను శాఖల వారీగా రూపొందించారు. బదిలీల కోసం ఉద్యోగులు అప్షన్లు ఇచ్చుకునే గడువు సైతం కొన్ని డిపార్ట్ మెంట్‌లలో ముగిసింది.

సాధారణ బదిలీలు జరిగి ఆరేళ్లు...

సాధారణ బదిలీలు జరిగి దాదాపుగా ఆరేళ్లు కావస్తోంది. ఉద్యోగుల బదిలీలు 40 శాతానికి మించి చేయవద్దని ప్రభుత్వం నిబంధనలు విధించింది. దీంతో జూనియర్ ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే పలు శాఖలలో సీనియారిటీ జాబితాను ప్రకటించగా, మరికొన్ని ప్రకటించే అవకాశం ఉంది. బదిలీ ఉంటుందా... ఉండదా అని చర్చించుకుంటున్నారు. కొందరు ఉద్యోగులు జిల్లా ఆవిర్భావం నుంచి ఇక్కడే తిష్ట వేశారు. రెవెన్యూ శాఖలో కొందరు ఉద్యోగులు వీఆర్ఏ నుంచి డిప్యూటీ తహసీల్దార్ వరకు ఒకే ప్రాంతంలో విధులు నిర్వర్తించినట్లుగా ఆరోపణలున్నాయి. కొందరు జిల్లా స్థాయి అధికారులు సైతం జిల్లా ఆవిర్భావం నుంచి ఇక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు.

అటెండర్ నుంచి...

ఈ బదిలీలు నాలుగు స్థాయిల ఉద్యోగులకు బదిలీలు జరగనున్నాయి. జిల్లా స్థాయిలో అటెండర్ నుంచి రికార్డు అసిస్టెంట్, టైపిస్టు, జూనియర్ అసిస్టెంట్లు బదిలీలు కానున్నారు. బాసర జోన్ పరిధిలో సీనియర్ అసిస్టెంట్లు, సూపరింటెండెంట్, డిప్యూటీ తహసీల్దార్లు, గ్రేడ్-1, 2, 3 పంచాయతీ కార్యదర్శులు, హెచ్‌డ బ్ల్యూవో, ఎంపీహెచ్‌ఏ (ఏఎన్ఎం), స్టాఫ్‌నర్సు, ల్యాబ్ టెక్నీషియన్, వెటర్నరీ అసిస్టెంట్ ఉద్యోగులు ఉండనున్నారు. మల్టీజోన్ పరిధిలో ఎంపీడీవో, తహసీల్దార్, ఎంపీవో, వ్యవసాయాధికారి, ఏఈలు, ఏఎస్ డబ్ల్యూవో, ఏటీవో, మున్సిపల్ కమిషనర్లు, అసిస్టెంట్ సివిల్ సర్జన్‌లతో పాటు జిల్లా అధికారులు మల్టీజోన్‌ల పరి ధిలో బదిలీలు కానున్నారు.

వీరికి బదిలీ తప్పనిసరి....

జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ విభాగాల్లో సుమారుగా ఆరు వేల మంది ఉద్యోగులు ఉండగా అందులో గెజిటెడ్ ఉద్యోగులు సుమారు 900 మంది, నాన్ గెజిటెడ్ సుమారు 4,400 మంది, నాల్గవ తరగతి ఉద్యోగులు సుమారు 700 మంది ఉన్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు కోరుకున్న చోటుకు ఆప్షన్లు ఇచ్చుకునే అవకాశం కల్పించారు. నాలుగేళ్లు ఒకే చోట విధులు నిర్వర్తిం చిన వారికి బదిలీ తప్పనిసరి చేసింది. రెండేళ్లు సర్వీస్ పూర్తయిన వారు బదిలీ కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా ప్రకటించారు.

శాఖల వారీగా కమిటీలు

బదిలీలు నిర్వహించేందుకు ప్రతి శాఖలో ప్రత్యేకంగా కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. మల్టీజోన్, జోనల్ స్థాయి ఉద్యోగుల కోసం కమిషనర్, అదనపు కార్యదర్శి, జాయింట్ డైరెక్టర్‌లుగా సభ్యులుగా కమిటీ ఏర్ప డనుంది. జిల్లా స్థాయికి కలెక్టర్, అదనపు కలెక్టర్, సంబంధిత శాఖ అధికారి సభ్యులుగా ఉండనున్నారు.

మొదటి ప్రాధాన్యతగా ఇవ్వాలి. .

గత ప్రభుత్వం అమలు చేసిన జీవో 317 కారణంగా పలువురు ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ జీవోతో జోన్, జిల్లా మారి ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగుల నుంచి ఆన్‌లైన్ ద్వారా వినతులను జూన్ 30వ తే దీ వరకు స్వీకరించారు. రెండేళ్ల నుంచి కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ విధులు నిర్వర్తిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొంత ప్రాంతం ఆధారంగా ఆయా జిల్లాలకు బదిలీలు చేపట్టి తర్వాత సాధారణ బదిలీలు చేయాలని జీవో నంబరు 317 బాధితులు కోరుతున్నారు.

తుది దశకు ఉద్యోగుల బదిలీ ప్రక్రియ....

ప్రభుత్వ ఆదేశంతో జగిత్యాల జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీల ప్రక్రియ తుది దశకు చేరింది. ఇప్పటికే సుమారు 25 శాఖల నుంచి సీనియారిటీ జాబితాను తయారు చేసిన అధికారులు....అందులో ఖాళీలు ఎన్ని ఉన్నాయో తేల్చారు. ఉద్యోగులు తమ అవసరాలు, అవకాశాలును బట్టి ఆప్షన్లు నమోదు చేశారు. దరఖాస్తు, ఆప్షన్ల నమోదు సైతం ముగియడంతో వివిధ శాఖల్లో బదిలీల కౌన్సిలింగ్ నిర్వహించ డానికి కసరత్తులు జరుగుతున్నాయి. ఒక స్థానంలో నాలుగేళ్ల సర్వీసు మించితే వారిని బదిలీ ప్రక్రియలో చేర్చుతుండగా... ఉద్యోగ విరమణకు ఏడాది సమయం ఉన్న వారికి ఈ ప్రక్రియ నుంచి కొన్ని శాఖల్లో మినహాయింపు ఇస్తున్నారు. జిల్లాలో సుమారు వెయ్యి మంది వరకు అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి బదిలీలు ఉంటాయని తెలుస్తోంది. బదిలీ అయ్యే ఉద్యోగుల్లో ఎక్కువగా పంచాయతీ కార్యదర్శులు, నాలుగో తరగతి ఉద్యోగులు, డ్రైవర్లు ఉండనున్నారు. అదేవిధంగా జిల్లా స్థాయికి చెందిన వివిధ విభాగా అధి కారులు సైతం బదిలీ కానున్నట్లు తెలుస్తోంది. రెవెన్యూ శాఖలో ఎన్నికలకు ముందు వివిధ జిల్లాలకు బదిలీ అయిన తహసీల్దార్లు సొంత జిల్లాలకు రానున్నారు. ఇందుకు ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రావాల్సి ఉన్నట్లుగా సంబంధిత ఉద్యోగ వర్గాలు అంటున్నాయి. ఎలాంటి ఆరోపణలు లేకుండా బదిలీల ప్రక్రియనంతా పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు జిల్లాల ఉన్నతాధికారులు వెల్లడిస్తున్నారు.

ఏ కార్యాలయానికి వెళ్లినా అదే చర్చ...

జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంతో పాటు ఏ శాఖ కార్యా లయంలోనైనా బదిలీల గురించి చర్చే నడుస్తోంది. అధికారులు, ఉద్యోగులు ఎవరెవరికీ బదిలీ అవుతాయి, ఎవరు ఎక్కడి వెళ్లే అవకాశం ఉంది, ఎవరొస్తారు అన్న దానిపై ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. బదిలీ అయ్యే అవకాశం ఉన్న వారంతా తాము పెట్టుకునే ఆప్షన్లపై కుస్తీ పడుతున్నారు. చాలా కాలంగా బదిలీ అవ్వకుండా ఉండిపోయిన వారంతా ఈ సారి తమకు అనుకూలమైన స్థానాల కొరకు వెతుకులాట జరుపుతున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఇతర జిల్లాలకు బదిలీ అయిన తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎస్ఐలు సొంత జిల్లాలకు రావడానికి ప్రయత్నిస్తున్నారు. ఈనెల 20వ తేదీ నుంచి ఈ నెలాఖరు లోపు బదిలీల ప్రక్రియ పూర్తవుతుందని అధికార వర్గాలు అంటున్నాయి.



టీవీవీపీ కమిషనర్‌ను కలిసిన జగిత్యాల ఎమ్మెల్యే

జగిత్యాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్‌ను మంగళవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కలిశారు. హైద్రాబాద్‌లోని వైద్య విధాన పరిషత్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి పలు సమస్యలను విన్నవించారు. నియోజకవర్గంలోని రాయికల్ పీహెచ్‌సీకి పూర్తి స్థాయిలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా జీవో జారీ అయిన్పటికీ ఇందుకు తగిన విధంగా బడ్జెట్, హెడ్ అఫ్ అకౌంట్ రాలేదని వివరించారు. స్టాఫ్ రిక్రూట్‌మెంట్ సైతం జరగలేదని, సిబ్బంది ఎక్కువగా డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న ఉద్యోగుల బదిలీ ప్రక్రియలో రాయికల్, జగిత్యాల ల నుంచి పలువురు వైద్యులు, సిబ్బంది బదిలీ అయ్యే అవకాశాలున్నాయన్నారు. జగిత్యాల, రాయికల్ ప్రభుత్వ ఆసుపత్రిల్లో వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది యథావిధిగా ఉండే విదంగా చర్యలు తీసుకోవాలన్నారు.

కుట్టు కేంద్రాలను పరిశీలించిన డీఆర్డీవో

మల్యాల, జూలై 16: మహిళా కుట్టు శిక్షణ కేంద్రాలలో పాఠశాల విద్యార్థులకు కుట్టుతున్న యూనిఫామ్స్‌ను డీఆర్డీవో సంపత్‌రావు పరిశీలించారు. ముత్యంపేటలో ఏర్పాటు చేసిన కుట్టు కేంద్రంను మంగళవారం సందర్శించారు. విద్యార్థులకు ఇది వరకే ఒక జత అందించామని మరో జత యూనిఫామ్స్‌ను త్వరితగతిన అందించాలని సూచించారు. అనంతరం మండల సమాఖ్యలో దుస్తుల కటింగ్‌ను కూడా పరిశీలించారు. డీఆర్డీవో వెంట ఏపీఎం రాజయ్య, సీసీ కృష్ణమోహన్, వీఓఏ సుధ, రమ ఉన్నారు

బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడిగా అనిల్ కుమార్


నియామక పత్రం అందిస్తున్న విద్యాసాగర్‌రావు

రాయికల్, జూలై 16: రాయికల్ పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడిగా ఎలిగేటి అనిల్‌కుమార్ మంగళవారం ఎన్నికయ్యాడు. జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, మాజీ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ దావ వసంతసురేష్, మాజీ మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి అనిల్ కుమార్‌కు నియామక పత్రం అందజేశారు. అనిల్ గతంలో ఆరేళ్లు రాయికల్ మండల బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడిగా పార్టీకి సేవలందించాడు. ప్రస్తుతం అతని సతీమణి బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్‌గా సేవలు అందిస్తుండటంతో పార్టీ గుర్తించి పట్టణ పార్టీ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, మాజీ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ దావ వసంత సురేష్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జగిత్యాల యువకుడికి డాక్టరేట్

జగిత్యాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన పూటూరి ధర్మతేజ అను యువకుడు హైద్రాబాద్ ట్రిపుల్ ఐటీ డీమ్డ్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. పట్టణానికి చెందిన ధర్మతేజ ప్రాథమిక, ఉన్నత విద్యను జగిత్యాలలోనే అభ్యసించాడు. హైద్రాబాద్‌లోని ట్రిపుల్ ఐటీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశాడు. విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ కిషోర్ కొత్తపల్లి నేతృత్వంలో 'కృతిమ మేధ పారలల్ కంప్యూటరింగ్' అను అంశంపై పరిశోధన పూర్తి చేశాడు. ప్రస్తుతం ఇంటెల్ కంపెనీలో రీసెర్చ్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం హైద్రాబాద్‌లో జరిగిన 23వ స్నాతకోత్సవంలో కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రీయల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) డైరెక్టర్ జనరల్ కలైసెల్వీ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను పొందాడు.

రైతు బంధుపై ప్రభుత్వం కాలయాపన

- బ్లాక్‌మెయిల్‌తో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సీఎం రేవంత్ కొనుగోలు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు


మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు

జగిత్యాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో రైతు బంధు అమలులో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, బ్లాక్‌మెయిల్‌తో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సీఎం రేవంత్ రెడ్డి కొనుగోలు చేస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు విమర్శించారు. మంగళవారం పట్టణంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేల కొనుగోలు, బ్లాక్ మెయిల్, బెదిరింపులతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంపై సీఎం రేవంత్ రెడ్డి దృష్టి పెట్టారని ఆరోపించారు. తప్పుడు వాగ్దానాలు, నెరవేర్చని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను, రైతులను, నిరుద్యోగులను మోసానికి గురిచేసిందన్నారు. మొక్కజొన్న, పసుపు, వరి పంటలు సాగు చేసుకున్న కూడా ఇంత వరకు రైతు భరోసా డబ్బులు ఎకరానికి రూ. 15 వేలు ఇవ్వలేదని, కనీసం సీఎం కేసీఆర్ హయాంలో ఇచ్చిన రైతు బంధు రూ. 10 వేలు సైతం అందించలేదని దుయ్య బట్టారు. ప్రజాభిప్రాయ సేకరణ పేరిట కాంగ్రెస్ సర్కారు కాలయాపన చేస్తోందన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలుపై ఉన్న శ్రద్ధ సీఎం రేవంత్ రెడ్డికి రైతుల సంక్షేమంపై లేదని, ప్రజలను మోసానికి గురిచేసినందున వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. యువకులు, నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

మెగా డీఎస్సీ నిర్వహించాలి

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్

నిరుద్యోగులపై ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే జాబ్ క్యాలెండర్ ప్రకటించి, మెగా డీఎస్సీ నిర్వహించాలని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ అన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 1.31 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశామని, 26 వేల ఉద్యోగాల భర్తీ వ్యవహారంలో 75 శాతం ప్రాసెస్‌ను గత ప్రభుత్వం పూర్తి చేసిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ నేతలు పూటకో మాట మాట్లాడుతుండడంతో నిరుద్యోగులు ఆందోళనకు గురవుతున్నారని, కంట తడి పెట్టుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలకు చెందిన సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి సుమారు ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, నాయకులు కొల్ముల రమణ, తురగ శ్రీధర్ రెడ్డి, అనిల్ కుమార్, మహేశ్, అమీన్, ప్రవీణ్, గంగాధర్, సల్మాన్, గంగారెడ్డి, ప్రతాప్, ప్రణయ్, భగవాన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆల్ఫోర్స్‌లో ఆకట్టుకున్న మెహందీ ఉత్సవ్


మెహందీ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

జగిత్యాల అర్బన్, జూలై 16: పట్టణంలోని కృష్ణానగర్ గల ఆల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలల్లో మంగళవారం నిర్వహించిన మెహందీ ఉత్సవ్ విశేషంగా ఆకట్టుకుంది. ఆషాడ మాసంలో మహిళలకు అత్యంత ప్రతీకరమైన మైదాకు విశిష్టతను తెలియజేయడంలో భాగంగా కళాశాల ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు సాంప్రదాయ దుస్తులను ధరించి పండుగ వాతావరణాన్ని ఆవిష్కృతం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం సలహాదారును కలిసిన గల్ఫ్ జేఏసీ బృందం

భీమారం, జూలై 16: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమం కోసం ఈ బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించాలని గల్ఫ్ జేఏసీ బృందం సోమవారం రాత్రి సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డిని హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. గల్ఫ్ తదితర దేశాల్లోని వలస కార్మికుల సంక్షేమం కోసం గల్ఫ్ అండ్ అదర్ ఓవర్సీస్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, సమగ్ర ప్రవాస భారతీయుల విధానం ప్రవేశపెట్టాలని, గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లింపు గురించి స్పష్టమైన జీవోను విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా సీఎం సలహాదారు నరేందర్ రెడ్డి మాట్లాడుతూ గల్ఫ్ కార్మికుల అంశాన్ని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. అలాగే బోధన్ ఎమ్మెల్యే సు దర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు టి.జీవన్ రెడ్డి, బి.మహేష్ గౌడ్‌లను కలువాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భీమారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, గల్ఫ్ జేఏసీ కన్వీనర్ సింగిరెడ్డి నరేష్ రెడ్డి, గల్ఫ్ జేఏసీ నాయకులు మంద భీంరెడ్డి, ధర్మేందర్, మురళీధర్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించేందుకే ప్రజాదర్బార్

మున్సిపల్ చైర్ పర్సన్ జ్యోతి

జగిత్యాల టౌన్, జూలై 16 : ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ప్రజాదర్బార్‌లో పలువురు తమ సమస్యలను వినతుల రూపంలో చైర్ పర్సన్‌కు అందజేశారు. ప్రతి సమస్యను తక్షణమే పరిష్కరించా లని సంబంధిత అధికారులకు చైర్ పర్సన్ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం జ్యోతి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అంతకు ముందు ప్రజా దర్బార్ కార్యక్రమంలో సమయానికి హాజరు కాని అధికారుల తీరుపై చైర్ పర్సన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సమ్మయ్యతో పాటు వివిధ శాఖల అధికారులు ఉన్నారు.


చైర్ పర్సన్‌కు వినతి పత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

రాష్ట్రంలో విద్యా రంగానికి ప్రభుత్వం పెద్ద పీట

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, జూలై 16: రాష్ట్రంలో విద్యా రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సంఖ్య, విద్యా బోధన, విద్యార్థులకు అందించే భోజనం గురించి సంబంధిత శాఖ అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. వంట గది, బాత్ రూమ్‌లు, స్టోర్, పరిసరాలను ఆయన పరిశీలించారు. నాణ్యత కలిగి ఉన్న వస్తు సామగ్రి, వంట పదార్థాలు వాడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆయన సూచించారు. అనంతరం ఆయన మా ట్లాడుతూ విద్యా పరంగా ఎలాంటి సమస్యలు ఉన్న వెంటనే తన దృష్టికి తీసుకరావాలని పేర్కొన్నారు. స్వయంగా తానే పాఠశాలను తనిఖీ చేస్తానని విద్యా విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు పక్కా భవనాలు లేవన్నారు. పక్కా భవనాలు నిర్మించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో సంక్షేమ శాఖ మంత్రిగా పని చేసి న కొప్పుల ఈశ్వర్ ఎందు కోసం పక్కా భవనాలు నిర్మించలేదన్నారు. పాత శాల విద్యార్థులకు క్రీడల కోసం మైదానం ఏర్పాటు చేయిస్తానన్నారు. ధర్మపురిని ఒక సరస్వతి విద్యాలయంగా తీర్చిదిద్దుతానన్నారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సింహరాజు ప్రసాద్, పట్టణ అధ్యక్షులు అప్పం తిరుపతి, పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు ఒజ్జల లక్ష్మణ్, ఆశెట్టి శ్రీనివాస్, సుముఖ్, పోచయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


మైనార్టీ బాలికల పాఠశాలలో విద్యా బోధన గురించి అడిగి తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్ అడ్లూరి

అంజన్న సేవలో న్యాయమూర్తులు



కొండగట్టులో న్యాయమూర్తి మహేష్‌నాథ్

మల్యాల, జూలై 16: కొండగట్టు ఆంజనేయస్వామిని మంగళవారం పలువురు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. సిద్దిపేట జూనియర్ సివిల్ జడ్జి పి.చందన, మల్కాజిగిరి సీనియర్ సివిల్ జడ్జి జీవీ మహేష్‌నాథ్ వేర్వేరుగా స్వామి వారిని దర్శించుకున్నారు. న్యాయమూర్తులకు అధికారులు, అర్చకులు స్వాగతం పలుకగా స్వామి సన్నిధిలో పూజలు నిర్వహించారు. అనం తరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈవో చంద్రశేఖర్ తదితరులు సత్కరించారు.

● అంజన్నను దర్శించుకున్న పూర్ణ



స్వామివారి సన్నిధిలో పూర్ణ

ఎవరెస్ట్ శిఖరం అధిరోహించిన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందిన పూర్ణ మంగళవారం కొండగట్టుకు వచ్చి ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణను ఆశీర్వదించారు

రుణమాఫీ జీవోను సవరించాలి

జమ్మికుటం,జూలై 16: రుణమాఫీ జీవోను రైతులకు ప్రయోజనకరంగా ఉండేలా సవరించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు చెల్పూరి రాజు అన్నారు.పట్టణంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 2 లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని చెప్పి తీరా అధికారంలోకి వచ్చాక ఇచ్చి హామీలను విస్మరిస్తూ జీవోల పేరిట అయోమయా నికి గురిచేస్తున్నారని మండిపడ్డారు. రేషన్ కార్డు ఆధారితంగా ఉన్నవారందరినీ ఒకే కుటుంబంగా పరిగణించి కుటుంబంలో ఒక్కరికే రుణమాఫీ చేస్తే కుటుం బం నుంచి విడిపోయిన వారికి రుణమాఫీ వర్తించదన్నారు. పది సంవత్సరాలుగా రైతులు రుణాలు తీసుకొని వడ్డీలు పెరిగి ఇబ్బంది పడుతున్నారన్నారు. గత ప్రభుత్వం రుణమాఫీ సరిగా చేయకపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారన్నారు. ప్రతి రైతుకు రుణమాఫీ అయ్యేలా చూడాలని అన్నారు.

పంచాయతీ నిధులను కార్మికుల వేతనాలకే కేటాయించాలి

జమ్మికుంట,జూలై16: ప్రభుత్వం విడుదల చేసిన పంచాయతీ నిధులను కార్మికుల వేతనాలకే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్ ద్వారా విడుదల చేసిన నిధులలో మొదటి ప్రాధాన్యతగా గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలని అన్నారు. జిల్లాలో నాలుగు కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయని వాటిని వెంటనే చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ మండల కార్యదర్శి రవీందర్‌రావు, ఆసాల సారయ్య, రవి ఉన్నారు.

రూ.7,450 పలికిన పత్తి ధర

జమ్మికుంట,రూరల్16: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర రూ. 7,450 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు ఇద్దరు రైతులు తొమ్మిది క్వింటాళ్ల పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ట ధర.7,450 కనిష్ట ధర రూ.7,200 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

ఫేక్ మెసేజ్‌తో మోసం చేసిన వ్యక్తి అరెస్టు

జగిత్యాల టౌన్, జూలై 17: బట్టల షాపులో చీరెలు కొని రూ.10 వేలు ఫోన్ పే ద్వారా డబ్బులు పంపినట్లు ఫేక్ మెస్సేజ్ చూపించి మోసం చేసిన వ్యక్తిని మంగళవారం జగిత్యాల పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. జగిత్యాలలోని ఓ బట్టల దుకాణంలో ఈ నెల 12న నెంబర్ ప్లేట్ లేని బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి మోసానికి పాల్పడ్డాడు. అదే రోజు బాధితురాలు జగిత్యాల పట్టణ పోలీసులకు పిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. మంగళవారం టౌన్ సీఐ వేణు గోపాల్ ఆధ్వర్యంలో పోలీసులు విద్యానగర్ ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఓ వ్యక్తి పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. విచారణలో ఇటీవల జగిత్యాల పట్టణంలో ఫేక్ మెస్సేజ్‌తో రూ. 10 వేలు మోసం చేసిన వ్యక్తిగా గుర్తించారు. నిందితుడు మంచిర్యాల జిల్లాలోని హాజీపూర్ మండలం రాపల్లికి చెందిన రామగిరి సురేష్‌గా గుర్తించి అతని వద్ద రూ. 5 వేల నగదుతో పాటు ఒక సెల్‌ఫోన్, నెంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు సీఐ వివరించారు. నిందితుడిపై ఇదివరకే నిర్మల్ జిల్లాలోని నిర్మల్ టౌన్‌తో పాటు మంచిర్యాల జిల్లా నెన్నెల, జగిత్యాల జిల్లా సారంగాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు కేసులు నమోదైనట్లు వివరించారు.

మద్యం మత్తులో ఒకరి ఆత్మహత్య

రుద్రంగి, జూలై 16: రుద్రంగి మండల కేంద్రంలోని నేవూరిపల్లెకు చెందిన నేవూరి అంజయ్య(28) మద్యం మత్తులో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అంజయ్య మద్యానికి బానిసై నిత్యం తాగి వచ్చి భార్యను కొట్టేవాడు. కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెందిన అంజయ్య పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఉయ్యాలకు సోమవారం రాత్రి ఉరేసుకున్నాడు. అంజయ్య భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం

వీర్నపల్లి, జూలై 16: రుద్రంగి మండలం చింతామణి తండాకు చెందిన గుగులోత్ హరిసింగ్(60) అనే వృద్ధుడు అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. రుద్రంగి మండలం చింతమణితండాకు చెందిన గుగులోత్ హరిసింగ్ శనివారం భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గ్రామాల్లో వెతికారు. హరిసింగ్ ఆచూకీ లభించలేదు. భార్య గుగులోత్ దేవి రుద్రంగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

గట్టుదుద్దెనపల్లిలో చోరీ

మానకొండూర్, జూలై 16 : మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో మంగళవారం దొంగతనం జరిగింది. స్థానిక సీఐ రాజ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆకుల భారతమ్మ అనే మహిళ ఐదు రోజుల క్రితం కనపర్తి గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. మంగళవారం ఇంటికి వచ్చిన మహిళ ఇంటి తాళాలను గుర్తు తెలియని వ్యక్తులు పగుల కొట్టి ఉండడాన్ని గమనించి లోపలికి వెళ్లి చూసినట్లు తెలిపారు. ఇంటిలోని బీరువాను పగుల కొట్టి అందులోని రెండు తులాల చంద్రహారం, పట్టగొలుసులు దొంగిలించుకపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన ఆర్టీసీ డ్రైవర్ మృతి


మనోహర్‌రెడ్డి (ఫైల్)

కరీంనగర్ అర్బన్, జూలై 16: ఆర్టీసీ కరీంనగర్- 1 డిపో డ్రైవర్‌గా పని చేస్తున్న చిట్యాల మనోహర్‌రెడ్డి (55) ఈనెల 7న ఆత్మ హత్యకు యత్నించి చికిత్స పొందుతూ మంగళ వారం మృతి చెందాడు. మనోహర్‌రెడ్డి 7వ తేదీ మధ్యాహ్నం విధులకు హాజరైన సమయంలో ఆర్టీసీ అధికారులు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వ హించగా ఆల్కహాల్ శాతం 21 వచ్చింది. దీంతో డ్యూటీ చేయడానికి నిరాకరించిన అధికారులు నోటీసులు జారీ చేసి సస్పెం డ్ చేశారు. మనస్థాపం చెందిన డ్రైవర్ మనోహర్‌రెడ్డి వన్ డిపోలో బాత్ రూములో పురుగుల మందు తాగి పడి పోయి ఉండగా తోటి ఉద్యోగులు చూసి వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తర లించారు. చికిత్స పొందుతున్న మనోహర్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. దీంతో కుటుంబసభ్యులు, ఆర్టీసీ కార్మికులు మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. అప్పటి వరకు మృతదేహానికి పోస్టు మార్టం చేసేందుకు నిరాకరించారు. దీంతో ఆర్టీసీ పీఓ చంద్రయ్య, డిప్యూటీ ఆర్ఎం (మెకానికల్) సత్యనారాయణలు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మృతుడి కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం ఇచ్చే విషయం తమ పరిధిలో లేదని, ఉన్నతాధికారులకు రెక మండ్ చేస్తామని ఆర్టీసీ ఉద్యోగ సంఘ నాయకులకు, మృతుడి కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు పంచనామా చేసి పోస్టుమార్టం నిర్వహించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ఎండపల్లి, జూలై 16: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన రాయమల్లు (42) అనే యువకుడు మంగళవారం ఉదయం ఇంట్లో ఉరేసు కుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన రాయమల్లు గతంలో పది సంవత్సరాలు సింగాపూర్ వెళ్లి ఇంటికి తిరుగొచ్చి పంచర్ కొట్టు నిర్వ హించుకుంటూ జీవిస్తున్నాడు. రాయ మల్లు తండ్రి గతంలోనే మృతి చెందాడు. తల్లి మానసిక పరిస్థితి సరిగ్గా ఉండదు. ఇద్దరు కూతుళ్లు, భార్యతో పాటు తల్లిని పోషిస్తూ ఉండేవాడు. త నకు ఏ ఆపదొచ్చినా వెనకా ముందు ఎవరూ లేరని తరచూ తన భార్యతో చెప్పుకుంటూ మానసికంగా కృంగిపోయేవాడు. ఈ క్రమంలో మంగళవారం ఉద యం భార్యను నిద్ర లేపిన రాయమల్లు ఇంట్లోనే కాసేపటికి ఉరేసు కుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నిద్రలొంచి లేచిన పిల్లలు ఒక్కసారిగా తండ్రిని చూసి షాక్‌కు గురయ్యారు. అమ్మా నాన్నకు ఏమైంది. పిలిస్తే మా ట్లాడుత లేదు అంటూ తల్లితో రోదించిన తీరు అక్కడున్న వారిని కన్నీళ్లపె ట్టించింది. భార్య స్వరూప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

లాభాల బాటలో ఆర్టీసీ లాజిస్టిక్స్

● ఏటా పెరుగుతున్న ఆదాయం ● పది కోట్లకు చేరువలో సంవత్సర ఆదాయం


పార్సిల్స్ బుక్‌చేసుకోవడానికి వేచి ఉన్న కస్టమర్లు

భగత్‌నగర్, జూలై 16: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయా ణికులను చేరవేయడంతో పాటు ఆదాయ వనరులను అన్వేషిస్తున్నది. లాభాలు అంతంత మాత్రంగానే ఉన్న ఆర్టీసీకి జవసత్వాలు అందిం చేందుకు ఆర్టీసీలో కార్గో, లాజిస్టిక్స్‌ను 2020 సంవత్సరంలో ప్రవేశ పెట్టా రు. ఆర్టీసీ కరీంనగర్ రీజియన్‌లో 11 డీఓలు కరీంనగర్-1, కరీం నగర్-2, గోదావరిఖని, మంథని, జగిత్యాల, కోరుట్ల,మెట్‌పల్లి, సిరిసిల్ల, వేముల వాడ, హుజూరాబాద్, హుస్నాబాద్ డిపోలున్నాయి. నిత్యం ఆర్టీసీ బస్సు లు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు వెళ్తుండడాన్ని దృష్టిలో ఉంచుకుని పార్సిల్స్, పార్సిల్ కవర్స్, ప్రజలు తమకు సంబంధించిన వారికి వస్తు వులను ఆర్టీసీ ద్వారా పంపిస్తుండడంతో ఆర్టీసీ లాజిస్టిక్స్ లాభాల బాటలో పయనిస్తున్నది.


బార్‌కోడ్ ద్వారా వస్తువులను పరిశీలిస్తున్న సిబ్బంది

రీజియన్ వ్యాప్తంగా ఏటా పెరుగుతున్న ఆదాయం

రీజియన్ వ్యాప్తంగా 2020-21 సంవత్స రంలో 3,41,905 పార్సిల్స్ బుక్ చేసి 3,00,00,980 రూపాయలను ఆర్జించారు. 2021-22సంవత్సరంలో 5,40,728 పార్సిల్స్ బుక్‌చేసి 5,56,38,384 రూపాయలు అర్జించారు. 2022-23 సంవత్సరంలో 5,80,651 పార్సిల్స్ బుక్‌చేసి 7,47,62,857 రూపాయలు, 2023-24 సంవత్సరంలో 5,92,212 పార్సిల్స్ బుక్‌చేసి 9,32,99,988 రూపాయలు ఆర్జించారు. ఈ సంవత్సరం ఏప్రిల్ 2024 నుంచి జూన్ వరకు 1,33,047 పార్సిల్స్ బుక్‌చేసి 2,34,96,206 రూపాయల ఆదాయాన్ని అర్జించారు.

రీజియన్‌లోని వివిధ డిపోల్లో వచ్చిన ఆదాయం

కరీంనగర్ రీజియన్‌లో 11 డిపోల్లో 2023-24 సంవత్సరంలో ఏటా లాజిస్టిక్స్ ఆదాయం పెరుగుతూ 9,32,99,988 రూపాయల ఆదాయం సమకూరింది. గోదావరిఖని డిపోలో 68,671 పార్సిల్ బుక్ చేసి 1,10,37, 640 రూపాయలు, హుస్నాబాద్ 11,138 పార్సిల్స్‌కు 15,31,046 రూపా యలు, హుజూరాబాద్ 20,645 పార్సిల్స్‌తో 37,15,332 రూపాయలు, కరీం నగర్-1 డిపోలో 2,98,823 పార్సిల్స్‌తో 4,67,46,316 రూపాయలు, కరీంనగర్-2 డిపోలో 11,549 పార్సిల్స్‌తో 27,16,433 రూపాయలు, మంథని డిపోలో 8,435 పార్సిల్స్‌తో 12,39,473 రూపాయలు వచ్చింది.

జగిత్యాల డిపోలో 63,872 పార్సిల్స్‌తో 86,27,859 రూపాయలు, కోరుట్ల డిపోలో 19,788 పార్సిల్స్‌తో 27,57,522 రూపాయలు, మెట్‌పల్లి డిపోలో 21,046 పార్సిల్స్‌తో 27,48,054 రూపాయలు, సిరిసిల్ల 55,453 పార్సిల్స్‌తో 1,04, 58,060, వేములవాడ 12,792 పార్సిల్స్‌తో 17,22,253 రూపాయల ఆదాయం వచ్చింది. మొత్తానికి 2020-21 నుంచి నేటి వరకు ప్రతి సంవత్సరం ఆర్టీసీ లాజిస్టిక్స్ ఆదాయం ప్రతి ఏటా రెండు కోట్ల మేర పెరుగుతూ వస్తున్నది. ప్రయాణికులను చేరవేయడంతో పాటు పార్సిల్స్, కార్గో ద్వారా వస్తువులను చేరవేస్తూ ఆర్టీసీ ప్రజల మన్ననలు పొందుతున్నది.

కొత్త సాఫ్ట్‌వేర్‌తో సులభతరం: లాజిస్టిక్స్ ఏటీఎం సదాశివ్



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రారంభించిన కార్గో, లాజిస్టిక్ సేవలతో ప్రయాణికులకు మరింత చేరువయ్యాం. కొత్తగా ప్రవేశపెట్టిన సాఫ్ట్‌వేర్‌తో పార్సిల్స్, వస్తువులను ప్రయాణికులను సులభంగా చేర వేస్తున్నాం. బార్‌కోడ్ సిస్టంతో వస్తువులను సులభంగా తెలుసుకునే వీలుంది. బస్సులు చేరుకునే సమయానికి పార్సిల్స్ ప్రజలకు అందుతుండడంతో ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తున్నది. ఈ సంవత్సరం 11 కోట్ల మేర ఆదా యం రాబట్టాలన్నదే లక్ష్యంగా నిర్ణయించుకున్నాం.


పార్సిల్స్‌ను సిస్టంలో పరిశీలిస్తున్న సిబ్బంది

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

● 11 తులాల బంగారం, రూ. 4లక్షల నగదు ఆహుతి
● తప్పిన ప్రాణాపాయం

వెల్గటూర్, జూలై 16: మండలంలోని పైడిపల్లిలో గాదెనవేని మల్లయ్య ఇంటిలో మంగళవారం విద్యుదాఘాతంతో ప్రమాదం సంభవించింది. ఎస్సై ఉమా సాగర్ తెలిపిన వివరాల ప్రకారం మల్లయ్యకు ముగ్గురు కుమారులు, కూతురు ఉన్నారు. మల్లయ్యతో పాటు అతని చిన్న కుమారుడు గాదెనవేని సత్తయ్య, కోడలు మమత కలిసి ఒకే ఇంటిలో ఉంటున్నారు. పెద్ద కుమారుడు రమేష్ కొత్తగా ఇల్లు కట్టుకోవడం వలన వారికి సంబంధించిన వస్తువులు తండ్రి మల్లయ్య ఇంటిలోనే పెట్టాడు. మంగళవారం ఇంటిలో ఎవరి పనులకు వారు వెళ్లిన సమయంలో ఇంట్లో విద్యుదాఘాతంతో మంటలు వ్యాపించాయి. ఇంటిలో ఉన్న బట్టలకు, వడ్ల పరదాలకు మంటలు అంటుకొని ఇళ్లంతా వ్యాపించాయి. ఈ సంఘటనలో రమేష్‌కు చెందిన రూ.2 లక్షల నగదు, టీవీ, ఫ్రిజ్‌లు అగ్నికి కాలిపోయాయి. చిన్న కొడుకు సత్తయ్యకు చెందిన రూ. 2 లక్షల నగదు, అతని భార్యకు చెందిన 5 తులాల బంగారు ఆభరణాలు, మల్లయ్య కూతురుకు చెందిన 5 తులాల బంగారు ఆభరణాలు పూర్తిగా కాలిపోయాయి. ఈ ప్రమాదంలో మొత్తం రూ.4 లక్షల నగదు, 11 తులాల బంగారు ఆభరణాలతో పాటు బట్టలు, వివిధ ఎలక్ట్రానిక్ వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్సై తెలిపారు. అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే గ్రామస్థులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వారు వచ్చి మంటలు ఆర్పి వేశారు. కానీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగి పోయింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

తంగళ్లపల్లి, జూలై 16: తంగళ్లపల్లి మండల కేంద్రంలో ట్రాక్టర్, కారు ఢీ కొన్న ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ట్రాక్టర్ (ట్రాలీ లేకుండా)పై డ్రైవర్‌తోపాటు మరో వ్యక్తి వెళ్తున్నారు. అతి వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్ పైకూర్చున్న తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన మునిగే ప్రభాకర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ కార్డు లేకున్నా రూ.2 లక్షల రుణమాఫీ

● బీఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో వడ్డీ మాఫీ అమలు కార్యక్రమంగా రుణమాఫీ ● ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్, జూలై 16: రేషన్ కార్డు ఫ్యామిలీ యూనిట్ గుర్తింపు చేయడానికి తప్ప రుణమాఫీ అమలు చేయడానికి ఏ విధంగా అభ్యంతరం కాదని, రేషన్ కార్డు లేనివారు కూడా రూ.2 లక్షల రుణమాఫీ పొందే అవకాశం ఉందని ఎమ్మె ల్సీ జీవన్‌రెడ్డి అన్నా రు. రాయికల్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆనాడు యూపీఏ ప్రభుత్వం ఏకకాలం లో రూ.లక్ష రుణమాఫీ చేసిందని, మళ్లీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ హాయాంలో రూ.2 లక్ష రుణ మాఫీ ఏకకాలంలో చేయడం హర్షించదగిన విషయమన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు పర్యాయాలు రూ.లక్ష వరకు రుణమాఫీ చేస్తామని పేర్కొన్నప్పటికీ అది విడతలవారీగా వచ్చేసరికి కేవలం వడ్డీ మాఫీ అమలు కార్యక్రమంగా మిగిలిపోయింద న్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితిలో ప్రభుత్వంపై కొంత ఆర్థిక భారం అని భావించినప్పటికీ రైతు సంక్షేమం ప్రధానం కాబట్టి రాహుల్‌గాంధీ వరంగల్ డిక్లరేషన్‌లో పేర్కొన్న విధంగా ఏ విధమైన ఆంక్షలు లేకుండా కుటుంబం ఒక యూనిట్‌గా ఆగస్టు 15లోపు రూ.2 లక్షలు పూర్తి స్థాయిలో రుణమాఫీ అమలు చేసే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

రేషన్ కార్డు అనేది ఫ్యామిలీ యూనిట్‌ను గుర్తింపు చేయడానికి మాత్ర మే. దీనిపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు క్లారిటీ ఇచ్చారన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దేశంలో ఎక్కడా కూడా రుణమాఫీ కార్యక్రమాన్ని అమలు చేపట్టడం లేదన్నారు. ఈరోజు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యాలతోగానీ, చీడ పురుగులతోగానీ పంట నష్ట పోతే వారిని ఆదుకునే విధంగా పంటల బీమా పథకం అమలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఎకరాకు రూ.7500 ఇచ్చే విధంగా ముందుకు వెళ్తుందన్నారు. సన్న రకం సాగు చేసే రైతుకు ప్రతి క్వింటాల్‌కు రూ.500 మద్దతు ధరకు అదనంగా ఇస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరు మాసాల్లో రాయికల్ మండలంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి పూర్తి చేశామన్నారు. అనంతరం మండలంలోని లోక్యనాయక్ తండా, మంగ్యానాయక్ తండాలో శీత్లా భవానీ, తీజ్ పండుగ ఉత్సవాల్లో పాల్గొని దర్శించుకున్నారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజరెడ్డి ఉన్నారు.

లింగన్నపేట ఆందోళనలో 23 మందిపై కేసు

గంభీరావుపేట, జూలై 16 : గంభీరావుపేట మండలం లింగన్న పేటలో ఇటీవల శ్రీనాథ్ అనే యువకుడు ఆత్మహత్య చేసుకోగా మృతదేహంతో ఈ నెల 14న రోడ్డుపై ఆందోళన చేసిన ఘటనలో 23 మందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై రాంమోహన్ తెలిపారు. లింగన్నపేటకు చెందిన తుడుం శ్రీనాథ్ ఈ నెల 10న ప్రేమ వ్యవ హారంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. చికిత్స పొందుతూ 13న మృతి చెందాడు. శ్రీనాథ్ ఆత్మహత్యకు ప్రేమికు రాలు కారణమంటూ బంధువులు 14న అర్ధరాత్రి దాటాక రోడ్డుపై బైఠాయించారు. వాహనదారులకు ఇబ్బంది కలిగేలా చేయ డంతోపాటు ఉదయం కూడా శ్రీనాథ్ మృతదేహంతో మరోసారి ఆందోళన చేశారని, పోలీస్‌ల విధులకు ఆటంకం కలిగించారని ఎస్సై రాంమోహన్ వెల్లడించారు.

శ్రీనాథ్ ఇంటి నుంచి మృతదేహాన్ని గాంధీ వద్దకు తెచ్చే క్రమంలో పోలీస్‌లను బలవంతంగా తోసేశారని, శాంతి భద్రతలకు ఆటంకం కలిగించారని తెలిపారు. ఈ సంఘటనలో 23 మందిపై కేసు నమోదు చేశామని, కేసు విచారణలో భాగంగా ఈసానిపల్లి శేఖర్, గంగి నరేష్, కొత్తపల్లి ప్రవీణ్‌ను రిమాండ్‌కు తరలించామని పేరొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ద్విచక్రవాహనం చోరీ

ఎల్లారెడ్డిపేట, జూలై 16: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని దుకాణం ఎదుట నిలిపి ఉన్న ద్విచక్రవాహనాన్ని మంగళవారం దొంగలు ఎత్తుకెళ్లారు. గొల్లపల్లిలోని కర్ర దుకాణం ఎదుట బైక్‌ను నిలిపి లోనికి వెళ్లి వచ్చే సరికి వాహనం కనిపించకుండాపోయింది. బైక్ చోరీకి గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తాళం పగులగొట్టి రెండు ఇళ్లల్లో దొంగతనం

14 తులాల బంగారం, 37 తులాల వెండి ఆభరణాలు చోరీ

కరీంనగర్ క్రైం, జూలై 16: కట్టరాంపూర్‌లోని వినా యకనగర్, వివేకానందనగర్‌లో సోమవారం అర్ధరాత్రి దొంగలు తాళం వేసిన రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఒకటో ఠాణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వినాయకనగర్‌కు చెందిన టి.మంగ పంచాయతీరాజ్ శాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నది.

ఆమెకు మంగళవారం ఉద్యోగ బదిలీ కోసం కౌన్సెలింగ్ ఉండటం తో ఈనెల 14న రాత్రి ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్ళింది. మంగళవారం పక్క ఇంటివారు మంగ ఇంటి తలుపులు తెరచి, తాళం పగులగొట్టి ఉం దని ఫోన్‌లో ఆమెకు సమాచారం అందించారు. ఆమె కరీంనగర్‌లోని ఇంటికి చేరుకుని పరిశీలించగా కప్‌బోర్డు లో భద్రపరిచిన 14.3 తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలాగే పక్క ఇంటి వారి బైక్‌ను కూడా దొంగ లు ఎత్తుకుపోయారు. వివేకానందనగర్‌లో పద్మ ఈ నెల 13న ఉదయం ఇంటికి తాళం వేసి హైదరా బాద్‌లోని తన కొడుకు వద్దకు వెళ్లింది. ఆమె ఇంటి తాళం పగులగొట్టి ఉందని మంగళవారం స్థానికులు ఫోన్ చేయగా ఆమె కరీంనగర్‌కు వచ్చి చూసే సరికి ఇంటి బీరువాలో భద్రపరిచిన 17 తులాల వెండి ఆభరణలు కనపడలేదు. దొంగలు ఇంటిలో చొరబడి చోరీ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాధితుల ఫిర్యాదు మేరకు దొంగతనం కేసులు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలాలను కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ సరిలాల్, క్రైటీం పోలీసులు పరిశీలించారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీ లిస్తున్నారు. క్లూస్‌టీంతో వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు. నలుగు రు దొంగలు చేతులకు గ్లౌస్, ముఖాలకు మాస్కులు వేసుకుని దొంగతనాలకు పాల్పడినట్లుగా పోలీసులు ప్రాథమిక విచారణలో వెల్లడైంది.

హైనా దాడిలో లేగదూడ మృతి

చిగురుమామిడి, జూలై 16: మండలంలోని గాగి రెడ్డిపల్లిలో దేవునూరి వెంకటేశ్ అనే రైతుకు చెందిన లేగదూడ హైనా దాడిలో మంగళవారం మృతి చెందింది. గ్రామ శివారులో తన వ్యవసాయ బావి వద్ద పశువుల పాకలో పాడి ఆవులతో పాటు లేగ దూడను కట్టేసి సోమవారం సాయంత్రం రైతు వెంకటేశ్ ఇంటికి వచ్చాడు. మంగళవారం ఉదయం బావి వద్దకు వెళ్లి చూసే సరికి లేగదూడ మృతి చెంది ఉన్నది. తీవ్రంగా గాయపడ్డ లేగదూడను పరి శీలించగా హైనా దాడి అని నిర్ధారించినట్లు ఫారెస్టు అధికారులు తెలిపారు. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ మాజీ సర్పంచ్ సన్నీళ్ల వెంకటేశం కోరారు. చిగురుమామిడి మండలంలో హైనా దాడులు పెరిగి పోతున్నాయని, దీంతో రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లడానికి భయ పడుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. హైనా దాడులను అధికారులు అరికట్టాలని డిమాండ్ చేశారు.

వాహనాల దొంగలను పట్టుకున్న పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి

మెట్‌పల్లి, జూలై, 16 : మెట్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో వాహనాలను అపహరించిన ఇద్దరు దొంగలను మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై చిరంజీవిలు పట్టు కున్నట్లు డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. మం గళవారం పోలీసుస్టేషన్‌లో పట్టుకున్న దొంగలను చూపు తూ వివరాలను వెల్లడించారు. మండలంలోని చౌలమద్ది గ్రామానికి చెందని యాశాడ వెంకటి అనే రైతుకు సం బంధించిన మహేంద్ర ట్రాక్టర్ ట్రాలీని గ్రామ శివారులో జూన్ 29న ఉంచాడు. మండలంలోని రామా రావుపల్లి గ్రామానికి చెందిన పొన్నం రవీందర్‌గౌడ్ వ్యవ సాయం చేస్తూ ట్రాక్టర్ ట్రాలీలు కొంటూ అమ్ముతుండే వాడు. ట్రాక్టర్‌ల కోసం గ్రామాల్లో వెతుకు తుండగా చౌల మద్ది గ్రామ శివారులో ఉన్న యాశాడి వెంకటి ట్రాక్టర్ ట్రాలీ ని అపహరించాడు. అపహరించిన ట్రాలీకి రంగు మార్చి మరో చోట దాచాడు. మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలోని మణికంఠ వైన్స్ వద్ద ఈ నెల 12న చెప్పాల శంకర్ తన ద్విచక్ర వాహనాన్ని నిలిపాడు. మల్లాపూర్ మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన మదికుంట మహేష్ అనే వ్యక్తి మద్యానికి బానిసై నిలిపిన ద్విచక్ర వాహనాన్ని అపహరించాడు. బాధి తుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై చిరంజీ విలు పట్టణంలోని బస్ డిపో సమీపంలో వాహనాల తనిఖీలు చేస్తుండగా అను మా నాస్పదంగా కనిపించిన ఇద్దరిని పట్టుకుని విచారిం చగా వాహనాలను దొంగలించినట్లు ఒప్పుకున్నారు. అప హరించిన వాహనాలను వారి నుంచి స్వాధీనం చేసు కుని అరెస్టు చేసినట్లు తెలిపారు.

బొలెరో, ట్రాక్టర్ ఢీ ఇద్దరు మృతి


మహేష్, అభిషేక్ (ఫైల్)

ధర్మారం, జూలై 16: పెద్దపల్లి జిల్లా ధర్మారం మండ లం మల్లాపూర్ గ్రామ శివారులో మంగళవారం తెల్లవారు జామున బొలెరో, ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదం లో ఇద్దరు మృతి చెందారు. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్ గ్రామ శివారులో బొలెరో, ట్రాక్టర్ ఎదురె దురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పైన ఉన్న కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం ఆర్నకొండ గ్రామానికి చెందిన సోమిడి అభిషేక్ (22) అక్కడికక్కడే మృతిచెందగా, ట్రాక్టర్ డ్రైవర్ చీకట్ల మహేష్ (30) ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. అలాగే తాండ్ర అశోక్‌కు అనే యువకుడికి గాయాలయ్యాయి. ట్రాక్టర్‌ను ఢీకొట్టిన మంచిర్యాల లోని ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన బొలెరో డ్రైవర్ తూర్పటి రాజుపై మృతుడు మహేష్ తండ్రి పోచ య్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కట్టెలతో దాడి చేసి బంగారు, వెండి ఆభరణాల దోపిడీ

అనుమానితుల ఫొటోలు విడుదల చేసిన పోలీసులు


పోలీసులు విడుదల చేసిన అనుమానితుల ఫొటోలు

మల్యాల, జూలై 16: ఒంటరిగా ఉన్న ఓ వ్యక్తిపై గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు దాడి చేసి బంగారు, వెండి ఆభరణాలు, నగదుతో ఉడాయించారు. పోలీసులు తెలిపిన వివ రాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 9న జగిత్యాలరూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బండారి స్వామి కొడిమ్యాల మండలం నాచుపల్లికి వెలుతూ కొండగట్టు సమీపంలోని పెట్రోల్ బంక్ నుంచి క్వారీలకు వెళ్లే మార్గంలో ఆగాడు. ఒంటరిగా ఉన్నట్లు గుర్తించిన ఇద్దరు వ్యక్తులు కట్టెలతో వచ్చి స్వామిని కొట్టి అతని వద్ద గల బంగారం, వెండి, నగదు, సెల్‌ఫోన్ లాక్కొని పారిపోయారు. దీంతో బాధితుడు మల్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేయగా ఇద్దరు వ్యక్తుల ఆనవాళ్లను స్వామి తెలుపడంతో పోలీసులు అనుమా నితుల ఫొటోలను విడుదల చేశారు. ఈ ఫొటోలలో గల వ్యక్తుల వివరాలు తెలిస్తే తమకు సమాచారం అందించాలని తగిన పారితోషికం అందించనున్నట్లు సీఐ నీలం రవి, ఎస్సై నరేష్ ఈ సందర్భంగా తెలిపారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

ప్రాజెక్టులోకి 5,150 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 5,150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 13.485 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 22.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 436 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 7.826 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 1.861 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

ఒకరి రిమాండ్

సిరిసిల్ల క్రైం, జూలై 16: జిల్లాలోని తంగళ్లపల్లి మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన బాస ఎల్లవ్వ మెడలో నుంచి పుస్తెల తాడు చోరీ చేసిన మెదక్ జిల్లా గజ్వేల్‌కు చెందిన పర్వతం నర్సింహులును మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి తెలిపారు. మల్లాపూర్ గ్రామంలో ఎల్లవ్వ తన ఇంటి ముందు నిద్రపోతున్న సమయంలో ఈ ఏడాది జూన్ 21న సిద్దిపేట జిల్లా దుబ్బాకకు చెందిన మరో వ్యక్తితో కలిసి నర్సింహులు ద్విచక్రవాహనంపై వచ్చాడని, పుస్తెలతాడు తెంపుకొని పారిపోయాడని పేర్కొన్నారు. ఇదే సమయంలోనూ మల్లాపూర్ గ్రామంలో తాటిపల్లి బాలకిషన్, ఎడ్ల రమేశ్‌కు చెందిన మొబైల్ ఫోన్లు ఎత్తుకెళ్లారని తెలిపారు. బాధితుల ఫిర్యాదుతో సాంకేతిక సమాచారం ఆధారంగా సిరిసిల్ల వైపు వస్తున్న నర్సింహులును అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. మూడు తులాల పుస్తెలతాడు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు, మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు చెప్పారు.

ఊర కుక్క దాడిలో బాలుడికి గాయాలు


దేవేందర్ (ఫైల్)

బీర్‌పూర్, జూలై 16: ఊర కుక్క దాడి లో బాలుడికి తీవ్ర గాయాలై స్పృహ కో ల్పోయిన ఘటన బీర్ పూర్ మండలంలోని మంగేళ గ్రామంలో మంగళవారం సా యంత్రం చోటు చేసు కుంది. మంగేళ గ్రామంలోని గోండు గూడెంకు చెందిన పెంద్రం మారుతి ప్రతిభలకు ఇద్దరు పిల్లలున్నారు. పెద్ద కుమారుడు దేవేందర్ (7) సాయంత్రం 7 గంటల ప్రాంతంలో ఆడుకుం టుండగా ఊర కుక్క వచ్చి దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. మొఖం, తల వెనుక భాగంలో, చెవి దగ్గరా గాయ పరచగా చెవి తెగింది. ఈ దాడిలో బాలుడు స్పృహ కోల్పోయాడు. సమీపంలో ఉన్న కాలనీ వాసులు గమణించి కుక్క దాడి నుంచి బాలుడిని రక్షించి జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

సామాజిక సేవలో ముందుండాలి

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు



పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కృష్ణారావు

కోరుట్ల, జూలై 16 : సామాజిక సేవలో సత్యసాయి సేవా సమితి మరిన్ని నిర్వహించి ముందు వరసలో ఉండాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మంగళవారం పట్టణంలోని కల్లూర్ రోడ్డును సత్యసాయి సేవా సమితి ట్రస్ట్ ఆలయ సమీపంలో ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన నిధులతో చేస్తున్న పనులను జువ్వాడి కృష్ణారావు స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. కృష్ణారావు మాట్లాడారు. అభివృద్ధి పనులను వేగవంతగా పూర్తి చేసి సేవా సమితి మరింత అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సేవా సమితి అభివృద్ధికి నిధులు మంజూరుకు కృషి చేసిన కృష్ణారావును సమితి సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎంబేరీ నాగభూషణం కాంగ్రెస్ నాయకులు సంగ లింగం, అడెపు మధు, మచ్చ కవిత, ఎంబేరి సత్యనారాయణ, రియాజ్ ఓలెపు రాజేష్, సత్యసాయి సేవా సమితి ట్రస్ట్ వ్యవస్థాపకులు వేముల మాణిఖ్యం, సభ్యులు రూపలత, అశోక్, ముల్క రాజేశం, నవకిశోర్, ఉమాపతి పాల్గొన్నారు.

'ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి'

మెట్‌పల్లి రూరల్, జూలై, 16 : రుణమాఫీ అమలుపై రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు విధిస్తే ఊరుకోమని, ఏకకాలంలో అర్హులైన రైతులందరికీ ఎలాంటి ఆంక్షలు పెట్టకుండా రూ. 2లక్షల రుణమాఫీ చేయాలని మెట్‌పల్లి విశాల సహకార సంఘం మాజీ చైర్మన్ మారు మురళీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని వెల్లుల్ల గ్రామంలోని విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మర్చిపోతున్నారని ఆరోపించారు. ప్రధానంగా తెల్ల రేషన్‌కార్డు ద్వారానే రైతు కుటుంబాలను గర్తిస్తామని, వేర్వేరు కుటుంబాలుగా విడిపోయి పంట రుణాలు తీసుకున్న వారికి విడిగా రేషన్ కార్డులు రాలేవన్నారు. రైతు కుటుంబాల్లో చదువుకుంటున్న పిల్లల కోసం ఆదాయ పన్ను చెల్లించే వారిలో చాలా మంది రైతులు గ్రామాల్లో ఉన్నారన్నారు. రుణమాఫీ అమలుకు ప్రభుత్వం కొత్తగా షరతులు, నిబంధనలు విధించడం భావ్యం కాదన్నారు. గెలిచి ఏడు నెలలు గడుస్తున్న రైతు భరోసా, రుణమాఫీ కాకుండా ఇప్పటికే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ప్రకటించిన మార్గదర్శకాలను సవరించాలన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రూ. 2లక్షల రుణాలు మాఫీ చేసి, రైతుభరోసా అమలు చేయాలని కోరారు.

ధర్మపురిలో సరుగత్తి వేడుకలు

ధర్మపురి, జూలై 16: మొహర్రం పురస్కరించుకుని ధర్మపురి పట్టణంలో పెద్ద సరుగత్తి వేడుకలు మంగళవారం రాత్రి ఘనంగా నిర్వ హించారు. ఏటా నిర్వహించే విధంగా సాంప్రదాయ రీతిలో స్థానిక మున్సిపల్ కార్యాలయం, సారుగమ్మ, రహమత్ పుర వీధుల్లోని ఆ షూర్‌ఖానాల్లో నెలకొల్పిన పీర్లు, నాల్‌సాబుల వరకు ఊరేగించారు. అనంతరం మొక్కులు తీర్చుకున్నారు. పూనకంతో ఉన్న అనేక మంది నాల్‌సాబులు చేతపట్టుకుని సమీపంలో గల అగ్ని గుండంలో దూకి, ప్రదక్షిణలు చేశారు. పలువురు పెద్దపులులు, దెయ్యం తదితర వేషాలతో అగ్ని గుండం చుట్టూ ప్రదక్షిణలు చేయగా రాత్రి వరకు వందలాది మంది వేడుకలను తిలకించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దర్శించుకున్నారు. ఈ వేడుకలను ఆయా ఆషూర్‌ఖానాల ముజావర్లు సర్గాజ్, హుస్సేన్, షేక్ యూసుఫ్, ఘనంగా నిర్వహించారు. ఉర్దూ అకాడమీ బోర్డు మాజీ డైరెక్టర్ అన్వర్‌ఖాన్ సహకారం అందించారు. ఈ సంద ర్భంగా సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఉదయ్ కుమార్, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

మొక్కల పరిరక్షణకు కృషి చేయాలి



మొక్కలను నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, కమిషనర్ తిరుపతి

కోరుట్ల రూరల్, జూలై 16 : మొక్కలు నాటి వాటి పరిరక్షణకు కృషి చేయాలని మున్సిపల్ ఛైర్మన్ అన్నం లావణ్య-అనిల్ అన్నారు. మంగళవారం కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామంలోని సాయిబాబ దేవాలయ సమీపంలో మున్సిపల్ కమీషనర్ తిరుపతి, వైస్ ఛైర్మన్ గడ్డమీది పవన్‌లతో కలిసి వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి వాటి పరిరక్షణకు టీగార్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ అన్నం లావణ్య మాట్లాడారు. మొక్కలు పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసు కోని ప్రతి పౌరుడు మొక్కలు నాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బద్ది సుజాతలతో పాటు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

రైతులకు రశీదులను అందించాలి

మెట్‌పల్లి డివిజన్ వ్యవసాయ అధికారి లావణ్య

కోరుట్ల రూరల్, జూలై 16 : విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రశీదులను విత్తన దుకాణ దారులు ఇవ్వాలని మెట్‌పలి డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి లావణ్య సూచించారు. మంగళవారం పట్టణంలోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారిణి నాగమణితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుకాణంలో ఉన్న ఎరువుల వివరాల రికారులతో పాటు ఈ పాస్ మిషన్‌ను పరిశీలించారు. డీలర్లు తప్పని సరిగా ఎరువులను ఈ పాస్ యంత్రం ద్వారనే అమ్మాలని సూచించారు. విత్తనాలు, పురుగుల మందు అమ్మేటపుడు రైతులకు తప్పని సరిగా రశీదులను అందించి నమోదు చేసుకోవాలని సూచించారు. కోరుట్ల క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి నరేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల సమస్యలను పరిష్కరించండి

రాయికల్, జూలై 16: మండలంలోని ఒడ్డెలింగాపూర్‌లో గల ఎస్సీ మినీ గురుకుల పాఠశాలలో గల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కాయితి శంకర్ మంగళవారం ఎంపీడీవో చిరంజీవికి వినతి పత్రం సమర్పించారు. గురుకుల పాఠశాలలోని మెట్లపై కప్పుగా ఉన్న రేకులను కోతులు ధ్వంసం చేయడంతో వర్షం కురిసిన నీళ్లు విద్యార్థుల గదుల్లోకి వస్తున్నాయని, అలాగే కోతుల బెడద ఎక్కువగా ఉందన్నారు. విద్యార్థుల సౌక ర్యాలను దృష్టిలో పెట్టుకుని గురుకుల పాఠశాలలోని మెట్ల రేకులు, కోతులను నియంత్రించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేల్పుల ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై క్రయ విక్రయాలు చేస్తే చర్యలు

మున్సిపల్ కమిషనర్ తిరుపతి

కోరుట్ల, జూలై 16 : ఫుట్‌పాత్‌లపై వ్యాపారులు క్రమ విక్రయాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ తిరుపతి హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని జాతీయ రహదారిపై ఇరువైపుల నిర్మించిన ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసుకున్న విక్రయ సామగ్రి, స్టాల్స్‌ను తొలగించి దుకాణ దారులను హెచ్చరించారు. ఫుటుపాత్‌లపై విక్రయ సామాగ్రిలను ఏర్పాటు చేస్తే రూ. 5000 వరకు జరిమాన విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి ప్రవీణ్ కుమార్, రమ్యలతో పాటు పలువురు పాల్గొన్నారు.

డెంగ్యూపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా ఉపవైద్యాధికారి శ్రీనివాస్

జగిత్యాలరూరల్, జూలై 16 :డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామంలో సోమవారం డెంగ్యూ వ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉప వైద్యాధికారి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇండ్ల వద్ద నీరు నిల్వకుండా చూసుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉన్న చోట దోమలు గ్రుడ్లుపెట్టి లార్వాగా రూపాంతరం చెంది వాటిని నుంచి దోమల పునరుత్పత్తి పెరుగుతుందన్నారు. గ్రామాల్లో డ్రైనేజీలు శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. గ్రామపంచాయితీలు గ్రామాల్లో క్రమం తప్పకుండా రోజు విడుదల చేస్తే గ్రామాల్లో నీరు నిల్వకుండా ఉంటుందని తద్వారా కొంత మేర డెంగీ కేసులను నివారించవచ్చునని పేర్కొన్నారు. జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామంలో ఒక డెంగీ కేసు నమోదైందని, జిల్లా వ్యాప్తంగా 19 డెంగీ కేసులు నమోదైనట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఎంవో సత్యనారాయణ, ల్యాబ్ టెక్నీషియన్ ఆర్. బెనర్జీ, జగదీష్, గణేష్‌రాథోడ్, ఏ. శ్రీనివాస్, రాజేందర్, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

మల్యాల: వసతి గృహాలల్లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని నితాటిపల్లి బాలికల గురుకుల కళాశాలను వైద్య సిబ్బంది, స్పెషల్ రాపిడ్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా కళాశాలలో నీటి నిలువలు, కుళాయిలు తదితరవి పరిశీలించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గల 92 వసతి గృహాలలో దోమల నివారకు ఏసీఎం స్ప్రే చేస్తున్నట్లు తెలిపారు. ఈ స్ప్రే 4నుంచి 5వారాల పాటు పని చేయడం ద్వారా దోమలు వృద్ధి చెందే అవకాశం ఉండదన్నారు. విద్యార్థులు కూడా నీటి నిలువలు లేకుండా చూసుకోవాలని కుళాయిల వద్ద, డబ్బాలలో తదితర చోట్ల నీరు నిలువ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిం చారు. ఆయన వెంట అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యనారాయణ, శ్రీధర్, భాషుమియా, ఏఎన్ఎం షబాన ఉన్నారు.



తాటిపల్లి గురుకులం కళాశాలలో పరిశీలస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

కథలాపూర్ : పల్లెల్లో ప్రస్తుత సీజన్‌లో రోగాలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఎంపీవో ప్రవీణ్ సూచించారు. మంగళవారం మండలంలోని భూషణరావుపేట, పెగ్గెర్ల, ఊట్‌పల్లి గ్రామాల్లో పారిశుధ్య పనుల తీరును పర్యవేక్షించారు. మురికి కాలువల్లో మట్టి పేరుకుపోకుండా చూడాలని ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్ చల్లాలని పంచాయతీ కార్యదర్శులకు వివరించారు. చెత్తను ట్రాక్టర్లలో వెంటనే సమీపంలోని డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. మురికి కాలువల్లో దోమల బెడద రాకుండా బయోటెక్స్ స్ప్రే చేయించారు. వన మహోత్సవానికి సంబంధించి పలువురికి మొక్కలు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

మెట్‌పల్లి: వర్షాలు కురుస్తున్నందున పట్టణంలోని మురికి కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా శుభ్రం చేయాలని మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్ పారిశుధ్య సిబ్బందికి సూచించారు. మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ బస్ స్టాండ్ సమీపంలోని మురికి కాలువలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా వర్షాలు కురుస్తున్నందున మురికి కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. కాలువల్లో నీరు నిల్వ ఉండడం వలన దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉన్నందున సిబ్బంది రోడ్లు, కాలువలు, పరిసరాలను నిత్యం శుభ్రం చేయాలని సూచించారు. ఈయన వెంట ఇన్‌చార్జి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, టెక్నికల్ ఇంజనీరు మారు విష్ణువర్ధన్‌రెడ్డి, ముజీబ్, సిబ్బంది ఉన్నారు.

ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు మొరంపల్లి సత్యనారాయణ

మెట్‌పల్లి, జూలై, 16 : జిల్లాల్లో జరగబోయే సర్పంచు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థు గెలుపుకోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో నరేందర్‌రెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి రాష్ట్ర నాయకులు పల్లె గంగారెడ్డి, గడ్డె భూమన్న, వెంకట రమణి హాజరయ్యారు. గార్డెన్‌లో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో ఎనిమిది ఎంపీ, జిల్లాల్లో రెండు స్థానాలు, అసెంబ్లీ ఎన్నికల్లో కూడా 45 నియోజక వర్గాల్లో ముందంజలో ఉందన్నారు. రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని, గ్రామాల్లో జరగబోయే సర్పంచు, స్థానిక సంస్థలు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలుపించుకోవడానికి ప్రతి కార్యకర్త సైనికుల పని చేయాలన్నారు. దేశంలో మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్రమోడీ కావడం దేశ ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. మోస పూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రైతులు, ప్రజలను, ఫించన్లు అందించికుండా ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు సురభి నవీన్, భోగ శ్రావణి, బోడ్ల రమేష్, వడ్డేపల్లి శ్రీనివాస్, చెట్లపల్లి సుఖేందర్ గౌడ్, ఇల్లెందుల శ్రీనివాస్, ధోనికెల నవీన్, సదాశివ, క్రాంతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మెట్‌పల్లిలోని సమావేశంలో మాట్లాడుతన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు

కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శిగా నాగరాజు



మేడిపల్లి, జులై 16: కాంగ్రెస్ పార్టీ మేడిపల్లి మండల శాఖ ప్రధాన కార్యదర్శిగా చేపూరి నాగరాజు, కార్యదర్శిగా శ్రీధర్, ఎర్రన్నలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలిపారు. తనకు పార్టీ అప్పగించిన బాధ్యతను క్రమశిక్షణగా నేరవేర్చి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నేతలు లచ్చానాయక్, నర్సయ్య, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, నారాయణరెడ్డి, గంగారెడ్డి పాల్గొన్నారు.

'ఆరోపణలు మానుకోవాలి'

కోరుట్ల, జూలై 16 : తమపై చేస్తున్న తప్పుడు ఆరో పణలు మానుకోవాలని, వాటిని ఖండిస్తున్నట్లు మున్సిపల్ వార్డు సభ్యురాలు, బీజేపీ ఓబీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రుద్ర సుజత-శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమాశంలో మాట్లాడుతూ తమ పార్టీకి చెందిన నాయకులు తనపై తప్పుడు ప్రచారం చేస్తూ కొందరిని ప్రభోలపెట్టి వారితో మాట్లాడించి సామాజిక మాధ్యవల్లో పోస్టు చేస్తున్నారని ఆరోపించారు. తాను ఇంటి నిర్మాణం చేస్తున్న వారి వద్ద డబ్బులు వసూలు చేయలేదని రోడ్డుపై దిమ్మెలు నిర్మాణం కడుతు న్నారని ఫిర్యాదు చేయడంతో మున్సిపల్ అధికారులు నోటిసులు జారీ చేసి వాటి నిర్మాణం ఆపారే తప్ప తాను ఎలాంటి అవనీతికి పాల్పడలేదన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ రుద్ర సుజాత మాట్లాడుతూ పట్టణంలోని 33వ వార్డులో ఇళ్ల నిర్మాణాలు నిబంధనలకు విరు ద్ధంగా చేపడుతున్నారని వాటిపై కమిషనర్ దృష్టికి తీసుకపోయామే తప్ప తాము ఎలాంటి అవనీతి పాలు పడలే దన్నారు. తాను డబ్బులు డిమాండ్ చేసినట్లు నిరూపిస్తే కౌన్సిలర్ పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు.

మొక్కల సంరక్షణకు సహకరించాలి

రాయికల్, జూలై 16: ప్రతి ఒక్కరూ మొక్కల సంరక్షణకు సహకరించాలని రాయికల్ ఎంపీడీవో చిరంజీవి అన్నారు. మండలంలోని కిష్టంపేట గ్రామంలో గ్రామంలోని పారిశుధ్య పనులు, డ్రై డే కార్యక్రమాలను ఎంపీడీవో పరిశీలించారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా ప్రతి ఇంటికీ మొక్కలు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ మొక్కలను సంరక్షించాలని, పర్యావరణలో వచ్చే మార్పులను చెట్లను పెంచడం ద్వారా ఎదుర్కోవచ్చునని అన్నారు. మొక్కలను నాటి వదిలేయడం కాకుండా వాటి పరిరక్షణకు ట్రీ గార్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని మొక్కలను సంరక్షించాలన్నారు. దోమల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవా లని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వేణుగోపాల్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యం లోపిస్తే వ్యాధులు ప్రబలే ప్రమాదం

ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ

మెట్‌పల్లి రూరల్, జూలై, 16 : వర్షాకాలంలో సాధారణంగా దోమల బెడద తీవ్రంగా ఉంటుందని, పారిశుధ్యం లోపిస్తే వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉండకుండా నిత్యం పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇంచార్జి ఎంపీడీవో ప్రజలకు సూచించారు. మంగళ వారం మండలంలోని కొండ్రికర్ల గ్రామంలోని పారిశుధ్య పనులు, పరిసరాలను పరిశీలించి ఫాగింగ్ చేయించారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి పాత సామాన్లు, టైర్లు, వాడని కూలర్లు, పూల కుండీలు వంటి వాటిల్లో నిల్వ ఉన్న నీటిని తొలగింప జేయించారు. గ్రామంలో ప్రతి మంగళ వారం, శుక్రవారాల్లో తప్పకుండా డ్రైడేలు పాటిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శి హేమలతకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో దోమకాటు ద్వారా విషజ్వరాలు వ్యాపిస్తుంటాయి. ఖాళీ ప్రదేశాలు, మురుగు గుంతలు, డ్రైనేజీలో నిల్వ ఉండే నీటిలో దోమలు పెరిగే ప్రమాదం ఉందని, పరిసరాల ను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధుల బారిన పడకుండ ఉంటారన్నారు. గ్రామాల్లో ఏయే జ్వరాలు, వ్యాధులు ఎంతో తీవ్రంగా ఉందో వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏఎన్ ఎంలు ప్రజలకు సూచించాలన్నారు. ఈయన వెంటా ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి హేమలత, కారోబార్ వినోద్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఆలూరులో అంగన్‌వాడీ బడిబాట

రాయికల్, జూలై 16: మండలంలోని ఆలూరు, షైతాపూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఆలూరు అంగన్‌వాడీ కేంద్రం-1లో అంగన్‌వాడీ టీచర్ గాజెంగి గోదావరి ఆధ్వర్యంలో రెండేళ్ల వయస్సు దాటిన చిన్నారుల పేర్లను అంగన్‌వాడీ కేంద్రంలో నమోదు చేసుకుంటామన్నారు. గ్రామంలో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రం-2 టీచర్ సుజాత, ఆశ వర్కర్‌లు రాజేశ్వరి, పద్మలత, ఐకేపీ వీవోఏలు స్వరూప, విజయ, కిశోర బాలికలు, స్వశక్తి సంఘాల మహిళలు పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండలంలోని తిర్మలాపూర్ గ్రామ పంచాయతీలో గల సండ్రల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మల్యాల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సేవలను గ్రామంలో తిరుగుతూ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, విజయ, రాజేశ్వరి, ఆశ, గౌతమి, ఆయా రాధ పాల్గొన్నారు.

కథలాపూర్ : అమ్మ మాట...అంగన్‌వాడీ బాట కార్యక్రమానికి సంబంధించి మండలంలోని సిరికొండ, తాండ్ర్యాల, దుంపెట గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లు ర్యాలీలు నిర్వహించారు. ప్రధాన వీధుల వెంట నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. అంగన్‌వాడీకి పిల్లలను పంపండి... ఆరోగ్యవంతంగా ఉంచండి అని నినదించారు. 3 నుంచి ఆరేళ్లలోపు చిన్నారులను కేంద్రాలను పంపించి పౌష్టికాహారం పొందాలని కోరారు. ఈ కార్య క్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు ప్రతిభ, సునంద, సోమ లత, సువర్ణ, ఏఎన్ఎం విజయలక్ష్మీ, ప్రధానోపాధ్యా యులు పాల్గొన్నారు.

హరితహారంలో నాటిన ఈతచెట్లు తొలగింపు

చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన పంచాయతీ కార్యదర్శి

జగిత్యాలరూరల్, జూలై 16 : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం అభాసుపాలవుతోంది. హరితహారంలో భాగంగా మొక్కలు నాటి సంరక్షించాలని చేపట్టిన ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంలేదు. హరితహారం చెట్లను తొలగించిన వ్యక్తులపై క్రిమినల్ కేసులు పెడతామని కలెక్టర్ ఇటీవల హెచ్చరించిన కొందరు వ్యక్తులు అవేమీ పట్టించుకోవడంలేదు. జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లి గ్రామంలోని ఎస్సారెస్పీ భూమిలో గ్రామపంచాయితీ ఆధ్వర్యంలో ఈత చెట్లను నాటి సంరక్షిస్తున్నారు. వీటిని మోరపల్లి గ్రామానికి చెందిన పత్తిరెడ్డి తిరుపతిరెడ్డి అనుమతులు లేకుండా తొలగించాడని గ్రామస్తులు ఆరోపించారు. విషయం తెలుసుకున్న జీపీ సెక్రటరీ చెట్లను తొలగించిన తిరుపతిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం రూరల్ తహసీల్దార్, రూరల్ ఎంపీడీవో, రూరల్ఎస్సై, ఎస్సారెస్పీ డివిజనల్ ఇంజనీర్లకు ఫిర్యాదు చేశారు. పలువురు గ్రామస్థులు ఎక్సైజ్ సీఐకి ఫిర్యాదు చేశారు.

కల్తీ పదార్థాలతో ఆహారం తయారు చేస్తే చర్యలు

జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష

మెట్‌పల్లి, జూలై, 16 : కల్తీ, అపరిశుభ్రత ప్రదేశాల్లో ఆహార పదార్థాలు తయారు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష హెచ్చరించారు. పట్టణంలోని కీర్తి ఫంక్షన్ హాల్ సమీపంలోని గోల్డెన్ మండి హౌస్ హోటల్‌లో ఆహారపదార్థాల నాణ్యతపై వచ్చిన ఫిర్యాదుపై మంగళవారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోల్డెన్ మండి హౌస్‌లో వివిధ రకాల ఫుడ్ కలర్స్‌ను కలిపిన మాంసం, నిల్వ ఉంచిన మాంసం, తయారు చేసిన ఆహార పదార్థాలు, ఆహారంలో కలిపే కలర్స్‌లను పరిశీలించి నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఎలా తయారు చేస్తారని నిర్వహకులను హెచ్చరించారు. వాటిని కల్తీ ఆహారం, తయారీకి వాడే వస్తువులను చెత్త బుట్టలో వేయించి, కలర్స్‌ను పారపోయించారు. మండి హౌస్‌ను సీజ్ చేసి లైసెన్సును రద్దు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిల్వ ఉంచిన మాం సంతో తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రజలకు అందించడం వలన వివిధ వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లల్లో తయారు చేస్తున్న ఆహార పదార్థాలలో రసాయనాలతో కూడిన కలర్స్‌ను వాడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలతో పాటు కేసులు నమోదు చేసి జైలు పాలవుతారన్నారు.



హోటళ్లలో ఉపయోగించే కలర్స్‌ను పారపోయిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

సంక్షిప్తం సమాచారం

రాయికల్: గత ప్రభుత్వ హయాంలో ఎంత అభివృద్ధి చేసిందో ప్రజలకు తెలుసునని రాయికల్ మండల బీఆర్ఎస్ నాయకులు అన్నారు. రాయికల్ పట్టణంలో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకుల సమావేశాన్నిబట్టి చూస్తే గుమ్మడికాయ దొంగ అంటే భుజాలు తడుముకున్నట్లు ఉందని, తాము అన్నది సరిగా అర్థం చేసుకోక వాళ్ల నాయకుడినే విమర్శించినట్లు భావించడం సరి కాదన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కాంతారావు, శ్రీధర్ రెడ్డి, మహేష్ గౌడ్, మహేందర్, సత్యనారాయణ, గణేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మల్యాల: మల్యాలకు చెందిన బెక్కం లక్ష్మన్ అనే యువకుడు రెండు రోజుల క్రితం పులి వేషం వేయగా అదే రోజు హఠన్మరం చెందడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కుటుంబానికి బాసటగా నిలిచారు. రూ.5వేలను పంపించగా కాంగ్రెస్ నాయకులు మృతుని కుటుంబసభ్యులకు మంగళవారం అందించారు. కాంగ్రెస్ నాయకులు ఆదిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మన్, తిరుపతి, వంశీధర్, మల్లేశంగౌడ్, లక్ష్మనాచారీ, సురేష్, రవి పాల్గొన్నారు

కోరుట్ల రూరల్: అంగన్ వాడి కేంద్రాలలో కిశోర బాలల అభివృద్ధిపై ప్రత్యేక దృషి ప్రభుత్వం సారించి పోష్టిక ఆహారం అందిస్తుదని ఎంపీఓ నీరజ అన్నారు. మంగళవారం మండలంలోని అయిలాపూర్ గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రంలో కిశోర బాలల పోష కులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అంగన్‌వాడి కేంద్రంలో ప్రభుత్వం ఇంగ్లీష్ మీడియంను ప్రవేశ పెట్టి నర్సరీ క్లాస్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్ వాడి కేంద్రాలలో బాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న విద్యతో పాటు పోష్టిక ఆహారం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాటి టీచర్లు, బాలల పోషకులు పాల్గొన్నారు.

మల్లాపూర్ : మండలంలోని విద్యుత్ సమస్యల పరిష్కరం కోసం రాఘవపేట సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో నేడు విద్యుత్ సరఫరాను ఈనెల 18న నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మంగళవారం విద్యుత్ అధికారులు ప్రకటన ద్వారా తెలిపారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి గ్రామాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యహ్నం 1.00 వరకు నిలిపివేసి మరమ్మతులను చేపట్టనున్నట్లు తెలిపారు. విద్యుత్ అంతరాయంకు వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

కథలాపూర్ : గత ఏప్రిల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామి మేరకు గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేసి రు. 500 బడ్జెట్ కేటాయించాలని గల్ఫ్ సంక్షేమ సమితి కోఆర్డినేటర్ గోపిడి దేవేందర్ డిమాండ్ చేశారు. మం గళవారం ప్రెస్ నోట్ విడుదల చేశారు. గల్ఫ్‌లో దాదాపు 15 లక్షల మంది తెలంగాణ వాసులు ఉపాధి పొందుతున్నారని ఎన్ఆర్ఐ పాలసీతో కూడిన గల్ఫ్ బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. గల్ఫ్ దేశాల్లో మృతి చెందిన వలస జీవుల కుటుంబాలకు రు. 5 లక్షల ఎక్స్ గ్రేషియాకు సంబంధించి చట్టబద్ధత కల్పించాలని కోరారు. అదేవిధంగా గల్ఫ్ వెళ్ళిన వ్యక్తుల పేర్లు ఓటర్ లిస్టు నుంచి తొలిగించవద్దని, ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలకు అర్హులుగా చేయాలని డిమాండ్ చేశారు.

రాయికల్: బాసర ట్రిపుల్ ఐటీ ఫలితాలు సోమవారం వెలువడగా పట్టణ కేంద్రంలోని ప్రగతి హైస్కూల్ విద్యార్థిని మారంపెల్లి వర్షిణీ సీటు సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ బాలె జయశ్రీశేఖర్, అకాడమిక్ డైరెక్టర్ నిఖిల్ కుమార్, ఉపాధ్యాయులు వర్షిణిని అభినందించారు.

●రాయికల్ పట్టణానికి చెందిన మాజీ ఎంపీటీసీ సింగని రమేష్ కుటుంబాన్ని ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. మాజీ ఎంపీటీసీ రమేష్ కోడలు ప్రమాదవశాత్తు గాయపడగా వారిని పరామర్శించారు. వీరి వెంట కాంగ్రెస్ నాయకులు రవీందర్‌రావు, గోపి రాజరెడ్డి, మ్యాకల రమేష్, మహిపాల్‌రెడ్డి, చిన్న భూమయ్య, దివాకర్ రెడ్డి పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండలంలోని శ్రీరాములపల్లె గ్రామానికి చెందిన మ ల్యాల మార్కెట్ కమిటీ తాజా మాజీ ఛైర్మన్ కొరండ్ల నరేందర్‌రెడ్డి మూడు రోజుల క్రితం కాలుకు గాయం కాగా మంగళవారం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు పులి వెంకటేష్ గౌడ్, కొండగట్టు దేవస్థాన డైరెక్టర్ ఒల్లాల లింగాగౌడ్, రైతుబంధు సమితి జిల్లా తాజా మాజీ సభ్యుడు అంజన్ కుమార్ ఉన్నారు.

ధర్మపురి: ముదిరాజ్ కులస్తులను బీసీ డీ గ్రూపు నుంచి బీసీ ఏ గ్రూపులో చేర్చాలని కోరుతూ ధర్మపురి మండల తహసీల్దార్ కృష్ణచైతన్యకు మంగళవారం ముదిరాజ్ కులస్థులు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దులు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి రాజన్న, రాజన్న, లస్మయ్య, మహేష్, నగేష్, వెంకన్న, పెద్దలచ్చన్న, వెంకటేష్, మల్లేష్, శేఖర్, బుచ్చన్న పాల్గొన్నారు.

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో మంగళవారం శ్రీహనుమాన్ చాలీసా గూర్చి ప్రవచనం కార్యక్రమం నిర్వహించారు. నైమిషారణ్య పీఠాధిపతులు, హిందూ ధార్మికసేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బాల బ్రహ్మానంద సరస్వతి గారిచే నిర్వహించిన ఈ ప్రవచనం కార్యక్రమంలో హనుమాన్ చాలీసా గురించి భక్తులకు వివరించారు. ఈవో చంద్రశేఖర్ పాల్గొన్నారు

●మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధిస్తూ సాధికారిత వైపు ముందుకు వెళ్లాలని జిల్లా మహిళా సాదికరత కేంద్రం నిర్వహకులు ఫైనాన్సియల్ లిటరసీ హేమశ్రీ, స్వప్న సూచించారు. మల్యాలలోని నిర్వహించిన కార్యక్రమంలో బేటీ బచావో-బేటీ పడావో, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సోషల్‌మీడియా దుష్ప్రభావాలు, బాల్య వివాహాల నిషేదం, మహిళల రక్షణ చట్టాల గురించి అవగాహన కల్పించారు.